వంతెన లేక ఇబ్బంది

- వర్షం పడితే రాకపోకలు బంద్
- పద్మనగర్, అంకుషాపూర్ మధ్యలో సండ్రవాగు కాలువ
- వంతెన నిర్మాణం కోసం ప్రయాణికుల ఎదురుచూపులు

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్–అంకుషాపూర్ గ్రామాల మధ్యన సండ్రవాగు కాలువ ప్రతి వర్షాకాలంలో ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు పారుతోంది. దీంతో ప్రాణాలకు తెగించి నీటి ప్రవాహంలోనే ప్రయాణాలు చేయడం లేదా రాకపోకలు నిలిచిపోవడం జరుగుతోంది. ఏళ్లుగా ఈ సమస్య వేధిస్తున్నా అధికారులు మాత్రం పరిష్కారం చూపడం లేదు. సండ్రవాగు కాలువపై కల్వర్టు నిర్మిస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని ప్రయాణికులు కోరుతున్నారు.

వరద వస్తే ఎక్కడివారు అక్కడే..

ఓ మోస్తరు వర్షం కురిస్తే చాలు సండ్రవాగు కాలువ పారుతోంది. దీంతో ఆ దారిలో ప్రయాణించే వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతోపాటు కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. అటువైపుగా ఉన్న గ్రామ ప్రజలు ఇటువైపు.. ఇటువైపు వారు అటువైపు.. వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీప గ్రామాల వారు నిత్యం ఈ దారిలోనే ప్రయాణిస్తారు. అంకుషాపూర్‌తోపాటు కొన్ని గ్రామాల ప్రజలు ఈ రోడ్డును ఉపయోగిస్తూ పద్మనగర్ గ్రామం మీదగా ఇటు సిరిసిల్ల వైపు, అటు సిద్దిపేట వైపు ప్రయాణాలు సాగిస్తుంటారు.


వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

సుట్టూ తిరిగిపోవుడే..

తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చేర్చే ప్రధాన రహదారి ఇదే కావడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సండ్రవాగు కాలువలో నీటి ప్రవాహం మొదలైతే తంగళ్లపల్లికి చేరుకోవాలంటే ప్రత్యామ్నాయ మార్గమైన లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ నుంచి రావాల్సి ఉంటుంది. అందుకోసం సుమారు 8 నుంచి 10 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి అవస్థలు పడాల్సి వస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తే చుట్టూ తిరిగి వెళ్లాల్సిరావడంతో విలువైన సమయం వృథా అవడంతోపాటు ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

వంతెన నిర్మిస్తేనే చింత తీరేది

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా అధికారులు చొరవ తీసుకుని సండ్రవాగు కాలువపై వంతెన నిర్మించి శాశ్వత పరిష్కారం చూపితేనే ఆయా గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుంది. కాబట్టి జిల్లా, మండల అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారంగా వంతెన నిర్మాణం చేపడితే అంకుషాపూర్, పద్మనగర్, బద్దెనపల్లి గ్రామస్తులతోపాటు ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో రవాణా కష్టాలు తీరుతాయి.

సండ్రవాగు కాలువపై కల్వర్టు నిర్మించాలి


అంకుషాపూర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు ఉన్న ఏకైక మార్గం ఇదే. ప్రతి వర్షాకాలంలోను ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. జిల్లా అధికారులు స్పందించి సండ్రవాగు కాలువపై కల్వర్టు నిర్మించాలి.
– సామల శ్రీనివాస్ పద్మనగర్

రాకపోకలకు ఇబ్బంది అవుతుంది


మా గ్రామస్తులు దూరం నుంచి తంగళ్లపల్లికి రావాల్సి ఉంటుంది. వర్షాకాలంలో సండ్రవాగు కాలువ పారితే తిరిగి పోవాల్సి వస్తుంది. దీంతో మరింత దూరం పెరుగుతోంది. దీంతో సమయం వృథా అవుతోంది. ఆపద సమయంలో సమయమే ప్రాణాలను నిలబెడుతుందని గుర్తించాలి.
– కె.కుంటయ్య, ఎంపీటీసీ, అంకుషాపూర్

త్వరలో కల్వర్టు నిర్మాణం ప్రారంభం


అంకుషాపూర్–పద్మనగర్ సండ్రవాగు కాలువ మూలంగా వర్షాకాలంలో జరుగుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులకు నివేదించాం. మంత్రి కేటీఆర్ చొరవతో ప్రత్యేక నిధులు కూడా మంజూరయ్యాయి. అంకుషాపూర్ వరకు బీటీ రోడ్డుతోపాటు కల్వర్టు నిర్మాణానికి టెండర్లు పిలుస్తాం.
– పి.లచ్చాలు ఎంపీడీవో, తంగళ్లపల్లి

క్లుప్తంగా

గోశాలకు రాజన్న కోడెలు


కోడెలను అందజేస్తున్న ఆలయ అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ రాజన్న గోశాలలోని కోడెలను జనగామ, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన గోశాలలకు మంగళవారం అందజేశారు. జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన యాకన్న గోశాలకు 20 కోడెలు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన శివశంకర గోశాలకు 20 కోడెలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన జిల్లా ప్యానల్ కమిటీ


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

గంభీరావుపేట: గంభీరావుపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా ప్యానల్ కమిటీ అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. పాఠశాల, కళాశాలలో తరగతుల నిర్వహణ, పాఠ్యాంశాల బోధన, హాస్టల్ నిర్వహణ, గతేడాది సాధించిన ప్రగతి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉన్నతి, లక్ష్యసాధన కార్యక్రమాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రమేశ్, జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ పద్మజ, ప్యానల్ కమిటీ లీడర్ మనోహర్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేశ్, సభ్యులు సుమలత, పావని, రేణుక, హరీశ్, మనోహర్, చంటిబాబు, సురేందర్, మమత, హవిలా, రాములు, ప్రత్యేకాధికారి వసంత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాసం రోడ్డు క్లీన్


ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసానికి వెళ్లే రోడ్డును శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యేగా గెలిచిన ఆది శ్రీనివాస్ నివాసానికి వెళ్లే ప్రధాన రోడ్డును మున్సిపల్ సిబ్బంది మంగళవారం క్లీన్ చేశారు. పట్టణంలోని సెస్ ఆఫీస్ పక్కనుంచి సాయినగర్ ద్వారా ఆది శ్రీనివాస్ నివాసానికి చేరుకునే రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలను తొలగించారు. చెత్త కుప్పలు, మట్టి కుప్పలను తొలగించి రోడ్డును శుభ్రం చేశారు.



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

గంభీరావుపేట: మండల కేంద్రంలో శ్రీమహంకాళీ మహాలక్ష్మీ భూలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. యాగశాల ప్రవేశం, గోపూజ, గణపతి పూజ, భూశుద్ధి, అఖండ దీపస్థాపనం, మంటప సంస్కారం, అగ్ని ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయం ఎదుట భక్తులు రావి, వేప చెట్లు నాటారు.



చిత్రకథ



ఎన్నాళ్లీ కష్టాలు

గంభీరావుపేట: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా డ్రెయినేజీ నిర్మాణానికి తవ్వి వదిలివేయడంతో దుకాణాల్లోకి వెళ్లేందుకు వ్యాపారులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. దీంతో దుకాణాల్లోకి వెళ్లేందుకు యజమానులు తాత్కాలికంగా చెక్కలు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం రోడ్డు వెడల్పు 80 ఫీట్లుగా తీర్మానించి, ముందుకు వచ్చిన నిర్మాణాలను తొలగించింది. ఏడాది గడిచినా రోడ్ల విస్తరణ కొలిక్కి రాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లి, బోయినపల్లి, విలాసాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని బుధవారం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ ప్రశాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ మండలం మల్లారం 132/33 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు ఉన్నందున వెంకట్రావుపల్లి, మల్లాపూర్, మాన్వాడ, నర్సింగాపూర్, కొత్తపేట, కొదురుపాక, వరదవెల్లి, నీలోజిపల్లి, బోయినపల్లి, మర్లపేట, రామన్నపేట, రత్నంపేట, తడగొండ రోడ్ సైడ్, దేశాయిపల్లి, విలాసాగర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

చందుర్తి మండలంలో..

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ, తిమ్మాపూర్, మల్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలతో పాటు బండపల్లి, ఎన్గల్ గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.30 నిమిషాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ మహేశ్ తెలిపారు. సబ్‌స్టేషన్‌కు వచ్చే విద్యుత్ లైన్ మరమ్మతులు ఉండడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రుద్రంగి మండలంలో..

రుద్రంగి: బుధవారం మల్లారం 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రుద్రంగి సబ్‌స్టేషన్ పరిధిలోని మండల కేంద్రంతో పాటు కొత్తపేట గ్రామానికి విద్యుత్ అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ సెస్ ఏఈ రాకేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

వీర్నపల్లి మండలంలో..

వీర్నపల్లి: మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వీర్నపల్లి ఏఈ పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.

పరామర్శ


పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

గంభీరావుపేట: గంభీరావుపేట ఎంపీటీసీ నాగారపు భాగ్య కుటుంబాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం పరామర్శించారు. భాగ్య అత్తగారు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మండల, పట్టణ శాఖ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, వెంకటి యాదవ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ లింగం యాదవ్, డైరెక్టర్ అభిలాశ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాటాలు చేస్తాం

ముస్తాబాద్: బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు పోరాటాలు కొత్త కాదని ఉద్యమించి సాధించుకున్న తెలంగాణలో పదేళ్లు ప్రజా ఆశీర్వాదంతో పనిచేశామని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్‌ను ఇప్పటికీ ఐదుసార్లు గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. సిరిసిల్లను దేశంలోనే నెంబర్‌వన్ చేసిన ఘనత కేటీఆర్‌కు దక్కుతుందన్నారు. ముస్తాబాద్ సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు సర్వర్, సంతోష్‌రావు, మనోహర్, భరత్, నవాజ్, స్వామి, సతీశ్, నర్సింలు, సాయిలు, రవి, శ్రీనివాస్, ప్రశాంత్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కల్వర్టు పైపులు మాయంపై ఫిర్యాదు

బోయినపల్లి: బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే డబుల్ రోడ్డులో ఉన్న కల్వర్టు పైపులను కొందరు మాయం చేశారని ఆర్‌అండ్‌బీ ఈఈకి ఫిర్యాదు చేసినట్లు బోయినపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం తెలిపారు. వర్షాలకు కల్వర్టు ఒకవైపు కూలడంతో కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు చేశారని, కల్వర్టు పాత సిమెంట్ పైపులు తీసి పక్కకు దారిలో వేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 3న దారిలో ఉన్న పెద్ద సిమెంట్ పైపులు మాయం చేశారని, ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన ఆది శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బసచేసిన హోటల్ ఎల్లాలో ముఖ్యమంత్రిగా ఎంపికైన రేవంత్‌రెడ్డిని కలుసుకున్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలతో ఆయనను కలిశారు. అలాగే హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సిద్ధివినాయకుడిని దర్శించుకొని విఘ్నేశ్వరుడు, ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి శాలువాతో ఆయనను సత్కరించి ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.


రేవంత్‌రెడ్డితో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం నందికమాన్ వద్ద సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసి భారీ మెజార్టీతో వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్‌ను గెలిపించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, సర్పంచులు పండుగ ప్రదీప్, కదిరె రాజుకుమార్, ఎంపీటీసీ బస రాజశేఖర్, వంగ పర్శరాములు, ఎర్రం ఆగయ్య, ప్రభాకర్‌రెడ్డి, ఎర్రం సత్తయ్య, కత్తి కనుకయ్య, రగుడు పర్శరాములు, రమేశ్, లింగయ్య, మల్లేశం, చిట్ల శ్రీనివాస్, రాజుకుమార్ పాల్గొన్నారు.


వేములవాడ నందికమాన్ వద్ద కాంగ్రెస్ నాయకుల సంబరాలు

కొండగట్టు అంజన్న వద్దకు పాదయాత్ర

వేములవాడ: ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందినందుకు పట్టణానికి చెందిన తౌటు సాయి రాజన్న ఆలయం నుంచి కొండగట్టు అంజన్న వరకు పాదయాత్రగా మంగళవారం బయల్దేరారు.

తిరుపతి వెంకన్నకు మొక్కులు చెల్లింపు

రుద్రంగి: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొందడంతో తిరుపతిలో శ్రీవేంకటేశ్వర స్వామికి డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి మంగళవారం ప్రత్యేక పూజలు చేసి, తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నాడు.

రూ. కోట్లు పెట్టినా ఓట్లు రాలేదు

వేములవాడరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కార్పొరేట్ శక్తులు కోట్లు ఖర్చు పెట్టినా ప్రజలు ఓట్లు వేయలేదని వేములవాడ రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ అన్నారు. రూరల్ మండలంలోని వట్టెంల గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించేందుకు కొంతమంది కార్పొరేట్ శక్తులు వచ్చి రూ.కోట్లు ఖర్చు పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు సీపీఐ, టీజేఎస్ అన్ని వర్గాల ప్రజలు ఆయన గెలుపు కోసం కృషి చేశారని వారికి పార్టీ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో వట్టెంల ఎంపీటీసీ రంగు వెంకటేశం, ఎదురుగట్ల సర్పంచ్ సోయినేని కరుణాకర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వంగ మల్లేశం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రొండి రాజు, మీడియా కోఆర్డినేటర్ చిలుక ప్రభాకర్, నాయకులు గోవర్దన్‌రెడ్డి, బాలసాని శ్రీనివాస్, బండ శ్రీనివాస్, పాలకుర్తి పర్శరాములు, గుడిసె శంకర్, రాజేంద్రప్రసాద్, రమణారెడ్డి, శేఖర్, పర్శరాములు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో అందరి కలలు నెరవేరుతాయి

కోనరావుపేట: ఇందిరమ్మ రాజ్యంలో అందరి కలలు నెరవేరుతాయని బావుసాయిపేట ఎంపీటీసీ షేక్ యాస్మిన్‌పాషా అన్నారు. విద్యార్థుల, యువకుల బలిదానాలు చూడలేకనే సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. పదేళ్లలో ఉపాధి అవకాశాలు లేక యువత, పేద ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారన్నారు. ఆరు గ్యారంటీలు కోనరావుపేట మండలంలో అందరికీ అందేలా తనవంతు కృషి చేస్తానన్నారు.

చిత్రకథ



పేరుకే వేబ్రిడ్జి

వేములవాడ రూరల్: వేములవాడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఉన్న వేబ్రిడ్జి నిరుపయోగంగా మారింది. రూ.లక్షలతో ఏర్పాటు చేసిన వేబ్రిడ్జి మార్కెట్ కార్యకలాపాలు నిలిచిపోవడంతో యార్డులోకి ధాన్యంతో కూడిన వాహనాలు రాక తుప్పపట్టి ఎందుకు పనికిరాకుండా పోయింది.

అన్నదానం



వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో 950 రోజులుగా కొనసాగుతున్న అన్నదానంలో మంగళవారం చిన్నారుల చేత అన్నదానం చేయించారు.

వృద్ధురాలికి రక్తదానం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామానికి చెందిన మంగళి రంగమ్మ (60) కాలు ఆపరేషన్ చేయాల్సి ఉండగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా మండలం చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన సముద్రాల కిరణ్‌కుమార్ రక్తదానం చేశారు.

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసిన ఎల్లారెడ్డిపేట సర్పంచ్

ఎల్లారెడ్డిపేట: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం సర్పంచ్ సబితా ఇంద్రారెడ్డిని ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి దంపతులు మంగళవారం కలిశారు. ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

